కామాంధుడికి ఉరే సరి!

- **చిన్నారిపై లైంగికదాడి, హత్యకేసులో సంచలన తీర్పు**
- **కింది కోర్టు శిక్షను ఖరారు చేస్తూ హైకోర్టు జడ్జిమెంట్**

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ)/మణికొండ: 'ఐదేండ్ల చిన్నారిని పక్కింటి వ్యక్తి నమ్మకంగా తీసుకెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. చిన్నారిపై రెండుసార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. చిన్నారి ఎవరికైనా చెప్పుందేమోనని బండ రాయితోమోది కిరాతకంగా హత్య చేశాడు. ఇలాంటి మానవ మృగానికి జీవించే హక్కు ఉండకూడదు. ఇంతటి ఘోరానికి ఒడిగట్టిన ముద్దాయికి ఉరి శిక్ష విధించడమే సరైనది' అని హైకోర్టు బుధవారం సంచలన తీర్పు వెలువరించింది. కింది కోర్టు విధించిన ఉరిశిక్షను ఖరారు చేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించడం తెలుగు రాష్ట్రాల్లో ఇదే ప్రథమం. రంగారెడ్డి జిల్లా నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017 డిసెంబర్ 12న ఐదేళ్ల చిన్నారిపై లైంగికదాడి, హత్య కేసులో నిందితుడైన మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీ దినేశ్‌కుమార్ దార్నేకు రంగారెడ్డి జిల్లా కోర్టు 2021 ఫిబ్రవరి 9న విధించిన శిక్షను ఖరారు చేస్తూ తీర్పునిచ్చింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పీ శ్యాం కోషీ, జస్టిస్ సాంబశివరావునాయుడుతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ తీర్పును ఇచ్చింది. కింది కోర్టు 2023లో విధించిన తీర్పును ఆమోదించాలని సదరు కోర్టు హైకోర్టుకు నివేదించింది. ఈ వినతిని హైకోర్టు ధర్మాసనం ఆమోదించింది. ఇదే సమయంలో కింది కోర్టు తీర్పును సవాల్ చేస్తూ దినేశ్‌కుమార్ ధార్నే దాఖలు చేసిన క్రిమినల్ అప్పీల్ పిటిషన్‌ను కొట్టివేసింది.

బండరాయితో మోది..

రంగారెడ్డి జిల్లా నార్సింగి ప్రాంతంలో 2017 డిసెంబర్ 12న జరిగిన ఈ దారుణ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఐదేండ్ల చిన్నారి ఇంటి వద్ద ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. తల్లిదండ్రులు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నార్సింగి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ జీవీ రమణగౌడ్ నేతృత్వంలో కేసు దర్యాప్తు ప్రారంభించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి విచారణ చేపట్టారు. సీసీ కెమెరాలను పరిశీలించి దినేశ్‌కుమార్ ధార్నేను గుర్తించా రు. వెంటనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దినేశ్‌కుమార్ ధార్నే (23) అల్కాపూర్ టౌన్‌షిప్ ప్రాంతంలో నివాసముంటూ సెం ట్రింగ్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పోలీసుల విచారణలో నిందితుడు చేసిన నేరా న్ని ఒప్పుకున్నాడు. చిన్నారికి చాక్లెట్ ఇప్పిస్తానని చెప్పి లైంగికదాడి చేసి హత్య చేసినట్టు ఒప్పుకున్నాడని తెలిపారు. ఇన్‌స్పెక్టర్ జీవీ రమణ గౌడ్ విచారణ జరిపి ఆధారాలన్నింటినీ సేకరించి 90 రోజుల్లో చార్జిషీట్ దాఖలు చేశారు.రంగారెడ్డి ఎంఎస్‌జే కోర్టు ట్రయల్ నిర్వహించి నిందితుడు దినేశ్‌కుమార్ ధార్నేకు 2021 ఫిబ్రవరి 9న శిక్షను ఖరారు చేసింది. నిందితుడు ధర్నే న్యాయస్థానం తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ హైకోర్టులో క్రిమినల్ పిటిషన్‌ను దాఖలు చేశాడని చెప్పారు. తెలంగాణ హైకోర్టు నిందితుడి పిటిషన్‌ను కొట్టివేసి మరణ శిక్షను ధ్రువీకరించింది.

హైదరాబాద్‌లో మరో రేప్

మొదటిపేజీ తరువాయి...

నివాసం ఉంటున్నాడు. చలనచిత్ర పరిశ్రమలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నాడు. అనంతపురానికి చెందిన ఓ యువతి పుప్పాల్‌గూడలో నివసిస్తూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నది. ఆమె స్నేహితురాలి ద్వారా సిద్ధార్థవర్మ పరిచయమయ్యాడు. సినిమాల్లో అవకాశం కల్పిస్తానని నమ్మించి కొండాపూర్‌లోని ఇంటికి పిలిపించుకొని పలుమార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. అవకాశం కల్పించకపోవడంతో మంగళవారం సదరు యువతి గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సిద్ధార్థవర్మను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు.

బస్సులో లైంగికదాడి నిందితుడి అరెస్టు

- **సహకరించిన మరో డ్రైవర్‌నూ అరెస్టు చేశాం**
- **హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడి**

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 31: కదులుతున్న బస్సులో లైంగికదాడికి పాల్పడిన బస్సు డ్రైవర్ సహా మరో డ్రైవర్‌నూ 24 గంటల్లోగా అదుపులోకి తీసుకున్నట్టు హైదరాబాద్ ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వెల్లడించారు. ఉస్మానియా యూనివర్సిటీ ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన స్లీపర్ బస్సు నిర్మల్ నుంచి పామూరుకు సోమవారం సాయంత్రం డ్రైవర్లు ఈర్ల కృష్ణబాబు (31), రామగిరి సిద్ధయ్య (32)తో బయలుదేరిందని తెలిపారు. అదే బస్సులో బాధితురాలు (25) ఎనిమిదేళ్ల కుమార్తెతో కలిసి వెళ్తుండగా, మెదక్ జిల్లా చేగుంట సమీపంలో రాత్రి భోజనం కోసం బస్సును నిలిపారని చెప్పారు. తిరిగి బస్సు బయలుదేరుతుండగా, బస్సు డ్రైవర్ కృష్ణ బాధితురాలి వద్దకు వచ్చి బెర్త్ నంబర్ 5, 6కు వెళ్లాలని సూచించడంతో ఆ బెర్త్‌కు మారినట్టు వివరించారు. అర్ధరాత్రి బాధితురాలు గాఢనిద్రలోకి వెళ్లగానే గమనించిన నిందితుడు కృష్ణ బలవంతంగా బెడ్‌షీట్‌ను ఆమె నోట్లో కుక్కి, లైంగికదాడికి పాల్పడ్డాడని వివరించారు. బాధితురాలి కేకలతో మరో డ్రైవర్ సిద్ధయ్య సహాయం తో కృష్ణ పరారయ్యాడు. తోటి ప్రయాణికుల సహాయంతో బాధితురాలు 100కు ఫోన్ చేయగా పోలీసులు బస్సును నిలిపి, బాధితురాలిని వైద్యపరీక్షల నిమిత్తం దవాఖానకు తరలించినట్టు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిందితులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. సమావేశంలో ఏసీపీ గ్యార జగన్, సీఐ ఎన్ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో తల్లిపై లైంగికదాడి

వెల్దుర్తి, జూలై 31: కన్నతల్లిపైనే లైంగికదాడికి పాల్పడ్డాడు ఓ ప్రబుద్ధుడు. ఈ అమానవీయ ఘటన మెదక్ జిల్లా మాసాయిపేటలో జూలై 29న జరిగింది. గ్రామానికి చెందిన 35 ఏండ్ల వ్యక్తికి భార్య, పిల్లలున్నారు. అయితే.. వారు గత సోమవారం బంధువుల ఇంటికి వెళ్లారు. మద్యం తాగొచ్చిన ఆ వ్యక్తి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తల్లి (56)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. తీవ్ర మనోవేదనకు గురైన తల్లి బుధవారం చేగుంట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా.. పోలీసులు గ్రామానికి వెళ్లి విచారణ జరిపి కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రుణమాఫీ రెండో జాబితా గందరగోళమే

- **అర్హత ఉన్నా మాఫీ కాని రుణం**
- **అధికారులు, బ్యాంకర్ల నిర్లక్ష్యం ఫలితం**
- **ఆందోళనలో రైతన్నలు**

రుణమాఫీ రెండో జాబితాలోనూ తమ పేర్లు రాలేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. అన్ని అర్హతలు ఉన్నా మాఫీ కాకపోవడమేంటని వాపోతున్నారు. పాస్‌పుస్తకం, రేషన్ కార్డు ఉన్నా రుణం మాఫీ చేయకపోవడంపై మండిపడుతున్నారు. పలుచోట్ల వ్యవసాయ శాఖ, బ్యాంకుల అధికారుల తప్పిదాల వల్ల మాఫీకి నోచుకోలేకపోయారు. ఎవరో చేసిన తప్పులకు తామెలా బాధ్యులమంటూ రైతులు నిలదీస్తున్నారు.

తిమ్మాపూర్, జూలై 31: రేషన్‌కార్డు లేదని ప్రభుత్వం రుణమాఫీ చేయలేదని కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అల్గునూర్‌కు చెందిన యువరైతు గూడ అభినవ్ బుధవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. తాను రెండేండ్ల క్రితం అల్గునూర్‌లోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో తీసుకున్న రూ.95 వేలను మాఫీ చేయకపోవడం దారుణమని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న పంట రుణాల మాఫీ భూస్వాముల మేలు కోసమేనని ఆరోపించారు. రూ.రెండు లక్షలు మాఫీ ఎవరిని దృష్టిలో పెట్టుకుని చేస్తున్నారని.. దీనివల్ల బడుగు బలహీన వర్గాల వారు లబ్ధిపొందుతున్నారా? అని ప్రశ్నించారు. నిరుద్యోగినైన తనలాంటి వారికి న్యాయం జరుగుతుందని కాంగ్రెస్‌కు ఓటు వేస్తే తమకు తగిన బుద్ధి చెబుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నిబంధనల ముసుగులో అన్నదాతను ఇబ్బందిపెట్టడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

సగం మందికి కూడా రుణమాఫీ కాలేదు

హనుమకొండ సబర్బన్, జూలై 31: ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ వ్యవహారం మొత్తం గందరగోళంగా మారింది. మొదటి విడతతోపాటు రెండో విడత చేపట్టిన రుణమాఫీ పథకంలో గ్రామీణ ప్రాంతంలో అన్నదాతలు తమ పేర్లు మాఫీ జాబితాలో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. హనుమకొండ జిల్లాలో 1,40,011 మంది రైతులు ఇప్పటివరకు వ్యవసాయ శాఖ గణాంకాల్లో ఉన్నారు. వీరికి గత ప్రభుత్వాల హయాంలో రూ.132.13 కోట్లు రైతుబంధు రూపేణా రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతు రుణాల మాఫీ విషయంలో గణాంకాలు మాత్రం భిన్నంగా ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రెండు విడతలకు సంబంధించి 40,091 మందికి రుణమాఫీ జరిగినట్టుగా గణాంకాలు చెబుతుండగా, అసలు 1.40 లక్షల మంది పైచిలుకు రైతులు గత ఎన్నికల కంటే ముందే నమోదై ఉండటం గమనార్హం. దీన్నిబట్టి చూస్తే భారీ ఎత్తున రైతులకు రుణమాఫీ డబ్బులు ఎగ్గొట్టారనేది స్పష్టమవుతున్నది.

ఆధార్ తప్పిదంపై విచారణకు ఆదేశాలు

నల్లబెల్లి, జూలై 31: ఆధార్ నమోదు తప్పిదంతో రుణమాఫీ వర్తించని రైతుల వివరాలు తెలపాలని ప్రభుత్వ యంత్రాంగం బ్యాంకు అధికారులను ఆదేశించింది. ఈ మేరకు బుధవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'ఒకరి ఆధార్.. మరొకరికి రుణం' కథనానికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. గురువారం లోగా ఆధార్ నమోదు తప్పిదంతో రుణమాఫీకి అనర్హులైన జాబితాను సమర్పించాలని ఆయా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాలతో నియోజకవర్గంలోని అన్ని బ్యాంకుల సమాచారాన్ని సేకరించడంలో ఆయా బ్యాంకుల ఉన్నతాధికారులు బుధవారం నిమగ్నమయ్యారు. వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని డీసీసీబీలో ఏజీఎం మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో విచారణ చేపట్టారు. కాగా, డీసీసీ బ్యాంకుల్లో జరిగిన విచారణను డీసీవో సంజీవరెడ్డి పర్యవేక్షించారు.

నిర్మల్ జిల్లా కుంటాల కోఆపరేటివ్ బ్యాంకు సిబ్బందితో వాగ్వాదానికి దిగిన రైతు

బ్యాంకు అధికారులతో రైతు వాగ్వాదం

కుంటాల, జూలై 31 : నిర్మల్ జిల్లా కుంటాల మండలంలోని లింబా(కే) గ్రామానికి చెందిన అహ్మద్ ఆదిలాబాద్ డీసీసీ బ్యాంకులో 2015లో రుణం తీసుకున్నాడు. 2022లో రూ.11 వేల వడ్డీ కట్టి, రూ.40 వేల రుణం పొందాడు. మళ్లీ 2022 సెప్టెంబర్‌లో అదనంగా రూ.30 వేలు తీసున్నాడు. మొత్తం రూ.70 వేలు బాకీ ఉన్నాడు. 2023లో రెన్యువల్ చేయించలేదు. రాష్ట్ర సర్కారు రుణమాఫీ చేస్తుందని తెలిసి బ్యాంకుకు వెళ్లాడు. పరిశీలింగా రూ.1.12 లక్షలు కట్టాల్సింది ఉన్నది. వ్యవసాయశాఖ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయగా.. జాబితాలో అహ్మద్ పేరు లేదని అధికారులు తెలిపారు. ఎందుకని అడుగగా.. తన అకౌంట్‌కు ఆధార్ లింక్ కాకపోవడంతో రుణమాఫీ వర్తించలేదని చెప్పారు. దీంతో రైతు బ్యాంకుకు వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగాడు. సెక్రటరీ నాగభూషణ్‌ను వివరణ కోరగా.. సాంకేతిక లోపంతో ఆధార్ లింకు కాలేదని, వెంటనే అకౌంట్‌కు ఆధార్ లింక్ చేసి రుణమాఫీ కోసం ఫైల్‌ను పైఅధికారులకు పంపుతామని తెలిపారు.

బ్యాంకర్ల నిర్లక్ష్యంతో మాఫీ డబ్బులు వెనక్కి

కెనరా బ్యాంకు అధికారుల నిర్లక్ష్యంతో మాఫీ అయిన డబ్బులు వెనక్కి పోయాయి. హద్నూర్ కెనరా బ్యాంకులో రూ.75 వేల పంట రుణం తీసుకున్న. దానికి వడ్డీతో కలిపి రూ.1.20 లక్షల వరకు బ్యాంకులో అప్పు అయ్యింది. వడ్డీతో సహ డబ్బులు చెల్లించి రెన్యువల్ చేసుకున్న. రుణమాఫీలో రూ.లక్ష లోపు తీసుకున్న జాబితాలో నాపేరు వచ్చింది. బ్యాంకుకు వెళ్లి చూస్తే డబ్బులు రాలేదని అధికారులు చెప్పారు. వ్యవసాయాధికారులను సంప్రదిస్తే ఆధార్ కార్డు నంబర్‌తో స్టేటస్ పరిశీలిస్తే రూ. 75 వేల రుణ మాఫీ అయింది. బ్యాంకు ఖాతా తొలిగించడంతో డబ్బులు వెనక్కి వెళ్లిపోయినట్టు చెప్పిండ్రు. బ్యాంకులో తీసుకున్న లోన్‌కు వడ్డీతో సహ డబ్బులు చెల్లిస్తే, బ్యాంకు అధికారులు మాత్రం తీసుకున్న రూ.75 వేలు మాత్రమే ప్రభుత్వానికి పంపడం దారుణం. బ్యాంకు అధికారులు రెన్యూవల్ రుణ ఖాతా నంబర్ పంపకుండా పాత ఖాతా నంబర్ పంపి నాకు అన్యాయం చేసిండ్రు. కెనరా బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయాలి.

- అవుటి అంజన్న, హద్నూర్, సంగారెడ్డి జిల్లా

సర్కార్ తీరుతో ఆగమైతున్నం

ఏం కాంగ్రెస్ సర్కారో ఏమో.. రైతులమంతా ఆగమైతు న్నం రుణమాఫీ చేయవట్టి. సర్కారోళ్లు చేప్పేది ఒకటి చేసేది ఒకటి. నాకు 1.25 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. అక్కన్నపేటలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో రెండేండ్ల కిందట పాసుపుస్తకాలు పెట్టి రూ.50 వేలు రుణం తీసుకున్న. ఏడాదికోసారి రెన్యువల్ చేసుకున్న. కానీ, నాకు రుణమాఫీ వర్తించలేదు. నాకు రేషన్‌కార్డు, పాసు బుక్కు ఉన్నది. నాకు రుణమాఫీ ఎందుకు వర్తించలేదో అర్థం కావడంలేదు. రూ.లక్షలోపు రుణమాఫీ కింద నా బకాయి మాఫీ కాకపోవడంతో వ్యవసాయ అధికారులను, బ్యాంకోళ్లను అడిగిన. లక్షన్నర రుణమాఫీ లిస్టులో వస్తదని చెప్పిండ్రు. ఇప్పుడు లక్షన్నర రుణమాఫీ లిస్టులోనూ నా పేరు లేదు. అధికారులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఉన్నది. సీఎం రేవంత్‌రెడ్డి పేరు పెద్దరికంగా రుణమాఫీ చేస్తున్నామనీ చెప్పుతుండు. కానీ, ఊర్లలోకి వచ్చి చూస్తే నాలాంటోళ్ల బాధ తెలుస్తది. గిట్ల చేస్తే రానున్న రోజుల్లో సర్కారుకు పుట్టగతులు ఉండవు.

-మిట్టపల్లి లింగమూర్తి, అక్కన్నపేట, సిద్దిపేట జిల్లా

అప్పుల బాధతో పాడి రైతు ఆత్మహత్య

జగిత్యాల రూరల్, జూలై 31: జగిత్యాల జిల్లాలో అప్పుల బాధ భరించలేక పాడిరైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జగిత్యాల మండలం పోరండ్ల గ్రామానికి చెందిన రైతు పడిగెల శ్రీనివాస్ (44) తన వ్యవసాయ భూమిలో రూ.20 లక్షలు అప్పు చేసి ఐదేండ్ల క్రితం డెయిరీ ఫాం పెట్టాడు. నష్టం రావడంతో అప్పుల తీర్చే మార్గం లేక మనోవేదనకు గురయ్యాడు. బుధవారం పొలం వద్దకు వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు విష్ణువర్ధన్ పొలం వద్దకు వెళ్లి చూడగా తండ్రి నురగలు కక్కుతూ కనిపించాడు. జగిత్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు జగిత్యాల రూరల్ పోలీసులు తెలిపారు.

కొడుకుపై తండ్రి దాష్టీకం

కాళ్లు, చేతులు కట్టి.. సంచిలో చుట్టి చెరువులో పడేసి భయపెట్టిన తండ్రి

కొల్లాపూర్, జూలై 31: చదువు రావడం లేదని, అల్లరి చేస్తున్నాడని ఓ తండ్రి కొడుకుపై దాష్టీకానికి ఒడిగట్టాడు.నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణానికి చెందిన ఓ తండ్రి బుధవారం తన ఏడేండ్ల కొడుకు కాళ్లు, చేతులను తాళ్లతో బంధించి గోనె సంచిలో చుట్టి శివాలయం వద్ద ఉన్న చెరువులో పడేశాడు. కాళ్లతో తొక్కుతుండగా అటుగా వెళ్తున్న వారు గమనించి ప్రశ్నించడంతో కుక్కను తొక్కుతున్నానని చెప్పాడు. బాలుడి అరుపులను విని వారు దగ్గరికి వెళ్లగా తండ్రి పరారయ్యాడు. పోలీసులు తండ్రిని అదుపులోకి తీసుకుని విచారించగా.. కొడుకుకు చదువు రావడం లేదని, వాడికి భయం పెట్టేందుకే ఇలా చేశానని చెప్పడం కొసమెరుపు. బాలుడికి ప్రాథమిక వైద్యం అనంతరం ఎస్సై రిషికేశ్ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలపై ఇలాంటి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెరిట్ ఆధారంగానే సీనియార్టీ లిస్టు

హైకోర్టు తీర్పు.. విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ హర్షం

హైదరాబాద్, జూలై31 (నమస్తే తెలంగాణ): విద్యుత్ సంస్థల్లో ఉద్యోగుల సీనియార్టీని మెరిట్ ఆధారంగా నిర్ధారించాలని, దానిపై తుది నిర్ణయం తీసుకుని తగిన ఆదేశాలు జారీ చేయాలని హైకోర్టు స్పష్టం చేయడంపై తెలంగాణ బీసీ, ఓసీ విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది. జేఏసీ చైర్మన్ కొడెపాక కుమారస్వామి, కన్వీనర్ ముత్యం వెంకన్నగౌడ్, కో-చైర్మన్ ఆర్ సుధాకర్‌రెడ్డి బుధవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. హైకోర్టు తీర్పును అమలు చేయాలని విద్యుత్తు సంస్థల యాజమాన్యాలను కోరారు. తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సంస్థల్లో 2009 నుంచి నేరుగా నియమితులవుతున్న ఉద్యోగుల సీనియార్టీని మెరిట్ ఆధారంగా నిర్ధారించాలన్న కమిటీ నివేదిక మేరకు 2021లో సంబంధిత సంస్థలు ఉత్తర్వులను జారీ చేశాయని గుర్తుచేశారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ తెలంగాణ విద్యుత్తు ఓసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం తరఫున ప్రధాన కార్యదర్శి సీ భానుప్రకాశ్ హైకోర్టును ఆశ్రయించారని, 1986 నుంచి నేరుగా నియమితులైన ఉద్యోగులందరి సీనియార్టీని మెరిట్ ఆధారంగానే నిర్ధారించాలని, నష్టపోయిన వారందరికీ పదోన్నతులు కల్పించాలని కోరారని వివరించారు. మెరిట్ ప్రాతిపదికన సీనియార్టీని నిర్ధారించాలని ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రెగ్యులేషన్స్‌లో చాలా స్పష్టంగా ఉన్నదని ఆయన వాదన వినిపిస్తూ.. బీమ్లేశ్ తన్వర్ కేసులో సుప్రీంకోర్టు 2003లో ఇచ్చిన తీర్పును ఉదహరించారని తెలిపారు. మరోవైపు విద్యుత్తు సంస్థలు కూడా మెరిట్ ఆధారంగానే సీనియారిటీలను నిర్ధారించాలని ఆదేశించాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాదిపదికగానే ఉద్యోగుల సీనియార్టీని నిర్ధారించి, పదోన్నతులు కల్పించాలని నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. 1986 నుంచి సీనియార్టీలను సమీక్షించినట్లయితే న్యాయపరంగా చిక్కులు వస్తాయని,ఇప్పటికే కొందరు ఉద్యోగ విరమణ పొందినందున 1986 నుంచి సీనియార్టీలను సమీక్షించడం వీలుకాదని న్యాయస్థానానికి వివరించినట్టు వెల్లడించారు. దీంతో పిటిషనర్ దరఖాస్తును మూడు నెలల్లోగా పరిశీలించాలని, 2009 కంటే ముందు నియమితులైన ఉద్యోగుల సీనియార్టీని మెరిట్ ఆధారంగా నిర్ధారణకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి ఉత్తర్వులు జారీ చేయాలని విద్యుత్తు సంస్థలను హైకోర్టు ఇటీవల ఆదేశించినట్టు జేఏసీ నేతలు వివరించారు.

రేపు సచివాలయం ఎదుట నిరసన దీక్ష

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గ్రామ పంచాయతీల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో శుక్రవారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర సచివాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టనున్నట్టు రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచు ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మా జీ సర్పంచులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మాజీ డీపీహెచ్ 'గడల' బదిలీ

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): మాజీ డీపీహెచ్ గడల శ్రీనివాసరావును ప్రభుత్వం బదిలీ చేసింది. పబ్లిక్ హెల్త్ విభాగంలో జాయింట్ డైరెక్టర్ క్యాడర్‌లో ఉన్న ఆయనను మహబూబాబాద్ అడిషనల్ డిస్ట్రిక్ట్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ (ఏడీపీహెచ్‌వో)గా నియమించింది. మరో ముగ్గురు ఏడీపీహెచ్‌వోలను కూడా బదిలీ చేస్తూ హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తు ఉత్తర్వులు జారీ చేశారు. జనగామ ఏడీపీహెచ్‌వో ధన్‌రాజ్‌ను సిద్దిపేటకు, సిద్దిపేటకు చెందిన మనోహర్‌ను యాదాద్రి భువనగిరికి, నిర్మల్‌కు చెందిన మల్లికార్జునరావును జనగామకు బదిలీ చేశారు. గడల శ్రీనివాసరావు వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేయగా, ప్రభుత్వం స్పందించడం లేదు. దీంతో ఆయన తిరిగి ఉద్యోగంలో చేరతారా? లేదా? అనే ఆసక్తి నెలకొన్నది.

ముగిసిన ఉద్యోగుల బదిలీలు

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగుల బదిలీల గడువు ముగిసింది. దీంతో ప్రభుత్వం బదిలీలపై నిషేధం విధిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): బదిలీల్లో భాగంగా చివరి రోజు స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో భారీగా బదిలీలు అయ్యాయి. ఇందులో సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా రిజిస్ట్రార్లు ఉన్నారు. మొత్తం 8 మంది జిల్లా రిజిస్ట్రార్లలను బదిలీ చేయగా.. డీఐజీ సుభాషిణికి వరంగల్ జిల్లా రిజిస్ట్రేషన్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. వీరితోపాటు పలువురు గ్రేడ్-1, గ్రేడ్-2 సబ్ రిజిస్ట్రార్లను బదిలీచేస్తూ స్టాం పులు రిజిస్ట్రేషన్ల శాఖ సీఐజీ జ్యోతి బుద్ధప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీఎం సభకు టీచర్లు హాజరు కావాల్సిందే

ఆదేశాలు జారీ చేసిన విద్యాశాఖ

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): బదిలీలు పొందిన ఉపాధ్యాయులందరూ ఈనెల 2న ఎల్‌బీస్టేడియంలో ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి సభకు కచ్చితంగా హాజరు కావాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్‌ఎంఎస్ అండ్ స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ వాళ్లు హాజరు కావాలని పేర్కొన్నారు.

6న గద్దర్ ప్రథమ వర్ధంతి

హైదరాబాద్, జూలై 31(నమస్తే తెలంగాణ): ఈ నెల 6న రవీంద్రభారతిలో గద్దర్ ప్రథమ వర్ధంతి నిర్వహిస్తున్నట్టు గద్దర్ ఫౌండేషన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది.

నేతన్న దీక్షలపై దౌర్జన్యం

సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తాలో నేతన్నల రిలే నిరాహార దీక్షల భగ్నంకు పోలీసులు యత్నించడం విమర్శలకు తావిచ్చింది. టెంట్‌హౌస్ యజమాని టెంట్‌ను తొలగించినా ఎండలోనే దీక్షలు కొనసాగాయి. బుధవారం పదో రోజు దీక్షలో భాస్కర్, ఉమాశంకర్, జనార్దన్, సతీశ్, బైరి మధు, సంతోష్, రాజమల్లు పాల్గొన్నారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు ఆకునూరి శంకరయ్య సంఘీభావం తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, శేఖర్‌గౌడ్, ఆంజనేయులు, ఆడెపు భాస్కర్, రవి, దామోదర్, అశోక్, సిరిమల్ల సత్యం, గోవిందు రవి, వెల్దండి శంకర్, వెల్దండి దేవదాస్ పాల్గొన్నారు.-రాజన్న సిరిసిల్ల

ప్రిన్సిపాళ్లను బదిలీ చేయొద్దని నిరసనలు

తమ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లను బదిలీ చేయొద్దని విద్యార్థులు బుధవారం ఆందోళనకు దిగారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలోని మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జైకిషన్ ఓజా బదిలీని నిలిపివేయాలని విద్యార్థులు ఊత్కూర్ చౌరస్తాలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. ఆదిలాబాద్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జలగం అనిత బదిలీని నిలిపివేయాలని విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం కాత్లే గంగారాంను బదిలీ చేయొద్దని విద్యార్థులు తెలంగాణ తల్లి చౌక్ వద్ద ధర్నాచేశారు. - లక్షెట్టిపేట/ఎదులాపురం/ఇంద్రవెల్లి

హిమాయత్‌నగర్‌లోని ఎస్‌ఎన్‌రెడ్డి భవన్ నుంచి అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజనం కార్మికుల చలో అసెంబ్లీ

అడ్డుకుని అరెస్టు చేసిన పోలీసులు

హిమాయత్‌నగర్/కోటగిరి, జూలై 31: సెంట్రలైజ్డ్ కిచెన్ విధాన నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని బుధవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఎస్ ఎన్‌రెడ్డి భవన్ నుంచి చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని చేపట్టారు. ర్యాలీగా బయలుదేరిన మధ్యాహ్న భోజన కార్మికులను నారాయణగూడ పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. పోలీసులు వారిని అరెస్ట్ చేసి వివిధ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అనంతరం అఖిల భారత మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షురాలు బీవీ విజయలక్ష్మి, రాష్ట్ర అధ్యక్షురాలు ప్రేంపావని, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్‌తో కలిసి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌పరం చేసే ప్రతిపాదనను వెనక్కి తీసుకొని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ధ్వజమెత్తారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన మధ్యాహ్న భోజన కార్మికులకు నెలకు రూ.10 వేల పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జంపాల రవీందర్, రమేశ్, ఎస్ విజయలక్ష్మి, డీ కమలారెడ్డి, కే రాములు, సుగుణ, చక్రపాణి, రాంమూర్తి, ముంతాజ్ బేగం, మల్లికార్జున్, రామకృష్ణ, కరుణకుమారి పాల్గొన్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి తహసీల్ కార్యాలయం ఎదుట బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా చేశారు. బకాయిలను విడుదల చేస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు.

సర్కారుపై కానిస్టేబుల్ అభ్యర్థుల ఆగ్రహం

- **జీవో 46ను రద్దు చేయాలని దిల్‌సుఖ్‌నగర్‌లో నిరసన**

ఎల్బీనగర్, జూలై 31: కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరుద్యోగులు మరోసారి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీవో 46ను రద్దు చేయాలని నిరసిస్తూ కానిస్టేబుల్ అభ్యర్థులు బుధవారం రాత్రి భారీసంఖ్యలో జాతీయ రహదారిపైకి వచ్చి, దిల్‌సుఖ్‌నగర్ మెట్రో స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ప్లకార్డులను చేతబూని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఉద్యోగాలు రాక ఆత్మహత్య చేసుకుంటున్నా ఏ నాయకుడూ పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి తన వైఖరిని మార్చుకుని జీవో 46ను రద్దు చేయాలని, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఆందోళన వల్ల రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవడంతో పోలీసులు వచ్చి నిరుద్యోగులను అడ్డుకునే ప్రయత్నం చేశారు.

రోడ్డెక్కితే అంగీలు చింపుతరా?:రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 31 (నమస్తే తెలంగాణ): జీవో 46ను రద్దు చేయాలని కోరుతూ నిరుద్యోగులు రోడ్డెక్కితే పోలీసులు వాళ్ల అంగీలను చింపుతరా? అని బీఆర్‌ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆ జీవో బాధితులు బుధవారం రాత్రి దిల్‌సుఖ్‌నగర్‌లో చేపట్టిన ఆందోళనపై రాకేశ్‌రెడ్డి స్పందించారు.నిరుద్యోగులకు కల్లబొల్లి హామీలిచ్చినందుకు కాంగ్రెస్‌నేతల ప్యాంట్లు ఊడపీకాలా? వద్దా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డికి, ఆయన మంత్రివర్గ సహచరులకు సిగ్గు, శరం ఉంటే మాట మీద నిలబడి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 46 జీవో బాధితుల ఉసురు రేవంత్ సర్కారుకు తగులుతుందని మండిపడ్డారు.